క్లుప్తంగా

తైబజార్ వేలం రూ.34వేలు

జడ్చర్ల టౌన్: గంగాపురం బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన తైబజార్ వేలం రూ.34వేలకు మాజీ వార్డు సభ్యుడు ఖదీర్ దక్కించుకున్నాడు. ఎంపీఓ సరోజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో ఆయన తైబజార్‌ను కైవసం చేసుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేయనున్న స్వీట్లు, లేడీస్‌కార్నర్స్, ఆటవస్తువుల దుకాణాలు నెలకొల్పేందుకు వేలం దక్కించుకున్న వ్యక్తి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

జడ్చర్ల: వచ్చేనెల 3న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని గుర్తు చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, రెడ్‌క్రాస్ సెక్రటరీ నటరాజ్, నాయకులు ప్రణీల్, శంకర్‌నాయక్, ఇమ్ము, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.10వేల విరాళం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదే పాఠశాలలో 2004–05వ సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం రూ.10వేల నగదును పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సప్ప, భాస్కర్, శరణప్ప, పరమేశ్వర్, కాశన్న, సీజీ.మధు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

ఇప్పటూర్‌లో ఉచిత వైద్యశిబిరం



నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ గ్రామంలో సీమ్ కార్పొరేషన్ ద్వారా బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాంనాయక్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి కల్పన ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ ఎస్సీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. జయప్రద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌ను బోధించటానికి సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంసీఏ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు తమ పూర్తి సర్టిఫికెట్లతో ఫిబ్రవరి 5వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకొని, డెమోకు అటెండ్ కావాలని తెలిపారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా రామ్మోహన్

జడ్చర్ల టౌన్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పాలాది రామ్మోహన్‌ను ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి లక్ష్మయ్య ఆయన ఎన్నికను ప్రకటించారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి రామకృష్ణ, అదనపు కార్యదర్శిగా కొండ చక్రధర్‌గుప్త, కార్యవర్గ సభ్యులుగా సోమిశెట్టి సాయికుమార్, కొత్రమధు, దాచేపల్లి చంద్రయ్య, ఆలంపల్లి మనోహర్, మూట్బూర్ రవీందర్, గుండా నరేష్, ఆనంద్‌రాజ్, ఎలిశెట్టి మురళీకృష్ణ, చెన్నారపు దేవరాజ్, కొప్పునూని రాఘవ, అనంతయ్యలు ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య మహాసభ ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నూతన అధ్యక్షుడు రామ్మోహన్ ప్రకటించారు.



ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ విజయేందిర బోయి
- కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, చిత్రంలో ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రజల ప్రాణాలను కాపాడటానికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎస్పీ జానకితో కలిసి రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవన్నారు. ఈ చర్యలు తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా పని చేయాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు వివరిస్తూ సమావేశంలో తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. ఎన్‌హెచ్ 44పై ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్ ప్రాంతాలు పెద్దాయిపల్లి, రాజాపూర్, రంగారెడ్డి గూడెం, మన్నూర్ దాబా, అడ్డాకుల హచరీస్ ప్రాంతాల్లో వాహనాల వేగం తగ్గించి ప్రమాదాల నివారణకు లైటింగ్, రంబుల్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి 5లోగా పనులు పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను ఆదేశించారు. ముదిరెడ్డిపల్లి నుంచి సెజ్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరారు. కేతేపల్లి వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. బాలానగర్ అండర్ వెహికిల్ పాస్ వద్ద పనులు జరుగుతున్నందున వాహనదారులకు రోడ్డు డైవర్షన్ తెలిసేలా సెక్యూరిటీని రెండు వైపులా, హెచ్చరిక సైన్‌బోర్డ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌హెచ్ 67పై వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్‌లు సైజు తగ్గిన వాటిని పునరుద్ధరించాలని సంబంధిత ఈఈని ఆదేశించారు. ఫిబ్రవరి 1నుంచి కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాలలో హెల్మెట్ లేకుండా వచ్చే వాహన దారులను అనుమతించడం జరగదని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ 2023 సంవత్సరం కంటే 2024 సంవత్సరంలో ప్రమాదాలు పెరిగినట్లు వివరిస్తూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలు గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్, అర్–బీ, రవాణాశాఖ ఎన్‌హెచ్ శాఖల అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ దేశ్యా, ఎన్‌హెచ్, మహబూబ్‌నగర్ ఈఈ రమేష్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కిషన్, ఆర్‌టీసీ ఆర్‌ఎం సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ విజయ్ భాస్కర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఆదాయం లేదు

- కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీకి రూ.3.98 కోట్ల ఆదాయం
- సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



భూత్పూర్‌లో మున్సిపల్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: భూత్పూర్ మున్సిపాలిటీలో నాలుగేళ్ల బీఆర్ఎస్ పాలనలో స్టాంప్ డ్యూటీ ఆదాయం రూపాయి కూడా రాలేదని, ఏడాది కాంగ్రెస్ ప్రజాపాలనలో రూ.3 కోట్ల 98లక్షల స్టాంప్ రూపకలో ఆదాయం వచ్చిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపాలిటీ సమీక్ష సమావేశానికి తహసీల్దార్ రహమాన్, ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మున్సిపల్ ఏఈని పూర్తి స్థాయిలో నియమించలేదని, వారం క్రితం మున్సిపల్ కార్యాలయం ఎదుట సంఘం కౌన్సిలర్లు మున్సిపాలిటీ పనులకు కాంగ్రెస్ నాయకులు అడ్డు తగులుతున్నారని తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. 10 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయలేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మున్సిపాలిటీలో పెండింగ్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

బీటీ రోడ్లకు రూ.10.76కోట్లు మంజూరు..

మండలంలోని వివిధ గ్రామాలకు ప్రధాన రహదారుల బీటీ నిర్మాణానికి రూ.10.76 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మున్సిపాలిటీలో వివిధ పనుల నిమిత్తం ప్రపోజల్స్ తయారు చేసి నివేదికను అందజేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

చిన్నచింతకుంట: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో మండల విద్యా అభివృద్ధి కమిటీ, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు జీఎంఆర్ సేవా సమితి ద్వారా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సామర్థ్యం కల్గిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ ఎల్లయ్య, విద్యా కమిటీ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కమిటీ మెంబర్లు ఉన్నారు.

చెరువులు నింపాలని ఎమ్మెల్యేకు వినతి

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్ శివారులోని చెరువులు, కుంటలను కృష్ణా నీళ్లతో నింపాలని కాంగ్రెస్ నాయకులు, రైతులు బుధవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని భూత్పూర్‌లో కలిశారు. గతంలో ఖిల్లాఘనపురం మీదుగా కేఎల్‌ఐ సాగునీరు మూసాపేట శివారులోని పెద్దవాగు వద్ద దిండు పైన ఉన్న కాల్వ ద్వారా నిజాలాపూర్‌లోని చెరువులు, కుంటలకు నీళ్లు వచ్చేవని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రస్తుతం ఘనపురం చెరువు వద్ద పనులు జరుగుతున్నందున కృష్ణా నీళ్లు రావడం లేదని, దీనివల్ల తమ గ్రామంలోని చెరువులు, కుంటలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని పేర్కొన్నారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున కృష్ణా నీళ్లు వచ్చేలా చేయాలని రైతులు కోరడంతో ఎమ్మెల్యే స్పందించి, వెంటనే డీఈ నరేందర్‌రెడ్డికి ఫోన్ చేశారు. నిజాలాపూర్ గ్రామానికి కృష్ణా నీళ్లు వదిలేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఘనపురం నుంచి కృష్ణా నీళ్లను అధికారులు నిజాలాపూర్ వైపు వదలడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సీజీ.గోవర్ధన్, రాంచందర్, పల్లెరవి, శ్రీనివాస్‌రెడ్డి, శాఖాపూర్ శ్రీను, రైతులు ఉన్నారు.

నేటితరానికి దేశ సంస్కృతి నేర్పాలి



మహమ్మదాబాద్: నేటితరం విద్యార్థులకు భారతదేశ సంస్కృతిని నేర్పించడం ఎంతో అవసరమని మండల విద్యాధికారి రాజునాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వస్తున్న మన భారత సంస్కృతిని నేటితరం విద్యార్థులకు తప్పకుండా అందించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శర్మ, రమేష్, చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారికి సన్మానం



నవాబుపేట: మండలంలోని కారుకొండ క్లస్టర్ పరిధిలో ఏఈఓ గౌతమిని బుధవారం క్లస్టర్ రైతులు ఘనంగా సన్మానించారు. ఆమె ఇటీవల గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ అవార్డు అందుకోవడంతో రైతులు సన్మానించారు. రైతు భరోసాకు చెందిన అన్ని గ్రామాల జాబితాను సిద్ధం చేసి అధికారులకు అప్పగించటం లాంటి పనులు వేగంగా పూర్తి చేసిందని రైతులు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, నర్సింహులు, కాకర్లపహాడ్ నర్సింహులు, కృష్ణయ్య, మాధవులు, తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

దేవరకద్ర: మండలంలోని నాగారంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన ప్రీతి ప్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



చిన్నచింతకుంట: నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామ ఊకచెట్టు వాగు నుంచి బుధవారం తెల్ల వారు జామున కొందరు అక్రమార్కులు మరికల్ మండల కేంద్రానికి నాలుగు ట్రాక్టర్లతో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నచింతకుంట మండలం లాల్‌కోట చౌరస్తా మీదుగా ఇసుక ట్రాక్టర్లు తీసుకెళ్తుండగా పోలీసుల తనిఖీలో వాటిని పట్టుకున్నారు. అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది



మాట్లాడుతున్నడీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: క్విజ్‌పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, తెలుసుకోవాలనే తపన ఏర్పడుతుందని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో బిగ్‌హెల్ప్ సంస్థ నియోజకవర్గస్థాయి పదో తరగతి విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో మొత్తం 23 పాఠశాలలు పాల్గొనగా బాదేపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు మొదటి బహుమతి లభించింది. ఆలూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు 2వ బహుమతి వచ్చింది. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, ప్రధానోపాధ్యాయులు యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల సెలబస్, వారు చదువుతున్న విధానం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు విజయసింహ, ప్రవీణ్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కోళ్ల ఫారాల వద్ద గ్రామస్తుల ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐలు వేణు, శ్రీనివాస్

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ శివారులోని మణి కోళ్ల ఫారాల వద్ద బుధవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. మంగళవారం రాత్రి కోళ్ల ఫారాల సమీపంలోని పొలాల వద్ద ఉండే రైతులకు, సిబ్బందికి మధ్య గొడవ జరిగింది. కోళ్ల ఫారాల నుంచి దుర్వాసన వస్తోందని తుంకినీపూర్, అచ్చాయపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు కోళ్ల ఫారాల వద్ద ఆందోళనకు దిగారు. కోళ్ల ఫారాలను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. దుర్వాసనతో వ్యాధులకు గురవుతున్నామని ఆరోపించారు. సమాచారం అందుకున్న మూసాపేట, అడ్డాకుల ఎస్‌ఐలు వేణు, శ్రీనివాస్‌లు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. దాడి చేసిన సిబ్బందిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దుర్వాసనపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసుల హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

పాఠశాలలో అదనపు కలెక్టర్ తనిఖీ



కోయిల్‌సాగర్ జెడ్పీ పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని టాయిలెట్లను, తాగునీటి సరఫరాను పరిశీలించారు. పాఠశాలలో పారిశుద్ధ్యం పనులు, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది



నవాబుపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

నవాబుపేట: బీఆర్ఎస్ కార్యాకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ప్రజల్లో తక్కువ కాలంలోనే విశ్వాసం కోల్పోయిందని ఆయన విమర్శించారు.

మెగారక్తదాన శిబిరం

వచ్చే నెల 3న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన కార్యక్రమం సందర్భంగా జడ్చర్లలో మెగా రక్తదాన శిబిరానికి మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

వేతనాలు పెంచాలని పీయూలో బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీ చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ అర్హత గల అధ్యాపకులకు గైడ్‌షిప్ ఇవ్వాలని, మహిళా అధ్యాపకులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, వెంకటేష్, సోమేశ్వర్, రామ్మోహన్, ప్రదీప్, శివకుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘వాహన’ చట్టాన్ని ఉపసంహరించాలి



మన్యంకొండ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం మోటార్ వెహికిల్ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మన్యంకొండ చౌరస్తాలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ వెహికిల్ చట్టం వల్ల ఆటో డ్రైవర్లు ఏ ప్రమాదానికి గురైన డ్రైవర్లే కారణమని, డ్రైవర్లకు ఏడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ చట్టం తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి సాయిలు, బాలకృష్ణ, రాము, నర్సింహులు, శ్రీనివాసులు, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైత్య భూమిని సందర్శించిన మాజీ మంత్రి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముంబైలోని డా.బీఆర్ అంబేడ్కర్ సమాధి చైత్యభూమిని బుధవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సందర్శించారు. ముంబైలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు పంచశీల నీలి కండువా కప్పి ఘనస్వాగతం పలికారు. బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముంబై వలస జీవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు మాజీ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీల కులగణన జరిపించాలని, చట్ట సభల్లో కుల దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముంబై ప్రధాన కార్యదర్శి శివరాజ్ బొల్లె, కురుమ సంఘం నేత జెట్టా కృష్ణ, రజక సంఘం నేత తడకపెల్లి నరేష్, రత్నవాత్, కార్మిక నేత రవీందర్ మహారాజ్, జనగం సైదులు గౌడ్, మందపెల్లి లక్ష్మణ్ నాయీ, పులిగిల్ల అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

1 నుంచి 3 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్‌లోని విజ్ఞాన సరస్వతీదేవి ఆలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ధర్మకర్త నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. చివరిరోజు వసంత పంచమిని పురస్కరించుకుని దేవకన్యలు, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ఏర్పాటుతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాతీయ క్రీడల ప్రారంభోత్సవంలో శాట్ చైర్మన్



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో బుధవారం 38వ జాతీయ క్రీడల ప్రారంభోత్సవంలో తెలంగాణ ప్రభుత్వం తరుపున రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, వీసీఎండీ బాలదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒంటె వాహనంపై ఊరేగిన అభయాంజనేయుడు



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం ఒంటె వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ నామస్మరణ మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమించొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపులా అలాగే ముఖ్య కూడళ్లలో ఫుట్‌పాత్‌లను ఎవరైనా ఆక్రమించి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పాలమూరు కార్పొరేషన్‌గా అవతరించినందున ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ముఖ్య కూడళ్లలో ఎవరూ ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఎలాంటి కటౌట్లు ఏర్పాటు చేయొద్దని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే మెయిన్ రోడ్డును పలుచోట్ల ఇరువైపులా ఆక్రమించిన వారు తమ బోర్డులను, ఇతర వస్తువులను స్వచ్ఛందంగా తొలగించుకుని మున్సిపల్ కార్పొరేషన్‌కు అన్ని విధాలా సహకరించాలని పేర్కొన్నారు. దీనిపై ఎరికైనా ఏమైనా సందేహాలు ఉంటే టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు.